క్లుప్తంగా

గణేశ్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్సై వీరేంద్రబాబు

తోటపల్లిగూడూరు : గణేశ్ ఉత్సవాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని తోటపల్లిగూడూరు ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు ఆయన తన కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు పొందాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పండగను జరుపుకోవాలని సూచించారు. కాగా ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు కోడూరు బీచ్‌లో గణేశ్ విగ్రహ నిమజ్జనాలకు అనుమతి లేదని తెలిపారు. 9వ తేదీ వరకు కోడూరు వేళాంగణి చర్చిలో ఆరాధనోత్సవాలు జరుగుతాయని, ఈ నేపథ్యంలో ఇరుపక్షాల భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేశారు. గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు సహకరించాలని కోరారు.

విద్యార్థిని ఉన్నత చదువులకు సాయం



కోవూరు : స్థానిక టీఎన్సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత విద్యాసంవత్సరంలో 964 మార్కులు సాధించిన విద్యార్థిని గౌరీకి బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. విద్యార్థిని ఉన్నత చదువుల నిమిత్తం కళాశాల అధ్యాపకులు సమష్టిగా రూ.20 వేల నగదుతో పాటు రూ.5 వేలు విలువ చేసే సూట్‌కేసును అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సికిందర్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలు నేడు

నెల్లూరు(బారకాసు): ఐటీఐ పూర్తి చేసిన నిరుద్యోగులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలను కొత్తూరు సమీపంలోని ఎస్వీఆర్ ఐటీఐ కళాశాలలో గురువారం నిర్వహించనున్నామని కరస్పాండెంట్ రెహమాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాల్గేట్ పామోలివ్ కంపెనీలో టెక్నీషియన్ల పోస్టుల కోసం ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారని, ఏడాది పాటు శిక్షణ అనంతరం రెగ్యులర్ చేయనున్నారని వివరించారు. శిక్షణ కాలంలో స్టయిఫండ్ రూపంలో నెలకు రూ.14,500 అందజేయనున్నారని చెప్పారు. పదో తరగతి మార్కుల లిస్ట్, ఐటీఐ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో పాటు మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను తీసుకురావాలని, వివరాలకు 97039 67967 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కరకట్టపై తమ్ముళ్ల కళ్లు

మండలంలోని జొన్నవాడ గ్రామంలో పెన్నానది కరకట్టను గ్రామ సర్పంచ్, టీడీపీ నేత కందికట్టు పెంచలయ్య, సోదరుడు వెంకటరమణయ్య లూటీ చేస్తున్నారు. ట్రాక్టర్లతో కరకట్ట మట్టిని తరలించి ఇటు సొంత అవసరాలకు, అటు అమ్ముకుంటూ రూ.లక్షలు గడిస్తున్నారు. దీంతో సమీప గ్రామాల ప్రజలు, రైతులు బిక్కుబిక్కుమంటున్నారు.

- జొన్నవాడలో టీడీపీ నాయకుల దుశ్చర్య
- వరదొస్తే సమీప గ్రామాల అడ్రస్ గల్లంతు
- చోద్యం చూస్తున్న అధికారులు



ట్రాక్టర్లతో మట్టి తరలించడంతో జొన్నవాడ వద్ద రూపు కోల్పోయిన పెన్నానది కరకట్ట

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : వర్షాకాలం నేపథ్యంలో పెన్నానదికి వరదొస్తే సమీప గ్రామాలపై తీవ్ర ప్రభావం ఉంటుంది. కరకట్ట తెగితే బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెనుబల్లి, కాగులపాడు, దామరమడుగు గ్రామాలు జలమయమవుతాయి. 2021 సంవత్సరంలో వచ్చిన వరదలకు కరకట్ట తెగిపోవడంతో దామరమడుగు వద్ద ముంబై జాతీయ రహదారిపై వరద నీరు చేరి రెండురోజుల పాటు వాహన రాకపోకలు నిలిచాయి. దీంతో పాటు కోవూరు మండలంలోని సాలుచింతల, స్టాబిడీ కాలనీ, పడుగుపాడు గ్రామాలు జలమయమయ్యాయి. రూ.కోట్లలో పంటనష్టం, ఆస్తి నష్టం సంభవించింది. ఆ నష్టం నుంచి రైతులు, సామాన్య ప్రజలు ఇప్పటికీ కోలుకోలేదు. ఈ సంఘటనను దృష్టిలో ఉంచుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కరకట్ట పటిష్టతకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సీన్ మారిపోయింది. రెండు మూడు నెలల నుంచి యథేచ్ఛగా మట్టిని తరలించి జొన్నవాడ గ్రామంలో కరకట్టను మాయం చేసేశారు. ఈ విషయమై పెంచలయ్య, రమణయ్యను గ్రామరైతులు ప్రశ్నించగా సమాధానం చెప్పకపోగా వారిపైనే దూషణలకు దిగుతున్నారు. కరకట్ట మాది ఏం చేసుకుంటారో చేసుకోండని బెదిరింపులకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో పెన్నానదికి వరదొస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తెలిసినా పట్టించుకోని అధికారులు

పెన్నానది కరకట్టను టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా తవ్వి దోచేస్తున్నా మండలాధికారులు ఆ వైపు కన్నెత్తికూడా చూడటంలేదు. నెలల కాలం నుంచి మట్టి తరలిస్తున్నా సెబ్, ఇతర అధికారులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ విషయమై ఇటీవల రైతులు, స్థానిక ప్రజలు జిల్లా కలెక్టర్‌తో పాటు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కరకట్టను తవ్వి సొమ్ము చేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే కనీవినీ ఎరుగని నష్టం చవిచూడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

జొన్నవాడలో గ్రామంలో కరకట్టను కొల్లగొట్టి మట్టిని తరలిస్తున్న విషయం గురించి మండల తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లును సాక్షి వివరణ కోరగా మట్టి తరలిస్తున్న విషయం తన దృష్టికి రాలేదన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– అంబటి వెంకటేశ్వర్లు, తహసీల్దార్

మట్టి విగ్రహాలనే పూజించండి

ముత్తుకూరు : పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితి సందర్భంగా ప్రతిఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జీజేరావు విజ్ఞప్తి చేశారు. పోర్టులో ఉద్యోగులు, కార్మికులకు 1,500 విగ్రహాలను ఆయన బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పండగ వేళల్లో పర్యావరణానికి నష్టం కలగకుండా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. పీఓపీ విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల జలాలు కలుషితమవుతాయని ఆందోళన వెలిబుచ్చారు. కార్యక్రమంలో ఈహెచ్ఎస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జ్యోతి, జి.వేణుగోపాల్, గణేష్‌శర్మ, వేణుగోపాలరెడ్డి, మృత్యుంజయరామ్ తదితరులు పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సీఈఓ జీజే రావు

లాభాల బాటలో పేదూరు సొసైటీ

తోటపల్లిగూడూరు : మండలంలోని పేదూరు సహకార వ్యవసాయ పరపతి సంఘం లాభాల బాటలో పయనిస్తున్నట్లు జిల్లా సహకార బ్యాంక్ అధికారి గురవప్ప అన్నారు. పేదూరు సొసైటీ కార్యాలయంలో సొసైటీ మహాజన సంఘ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా గురవప్ప మాట్లాడుతూ పేదూరు సొసైటీ కంప్యూటరైజేషన్ దిశగా కదులుతోందన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 2 నాటికి సొసైటీకి అన్ని వసతులు సమకూరుతాయన్నారు. అభివృద్ధి చెందుతున్న సొసైటీకి అనుబంధంగా వ్యవసాయ గిడ్డంగి కావాలని స్థానిక రైతులు కోరారని, అనువైన స్థలం లభిస్తే ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం జీవన ఎరువులు, నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ మహాజన సభ సంఘ సభ్యుడు ప్రకాష్, మండల వ్యవసాయాధికారి శిరీషారాణి, ఇఫ్కో ఫీల్డ్ మేనేజర్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు ప్రభాకర్, మోహన్‌కృష్ణ, సీనియర్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సొసైటీ సీఈఓ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సహకార బ్యాంక్ అధికారి గురవప్ప

పాఠశాలల పరిశుభ్రతను పర్యవేక్షించాలి



సూచనలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం



హాజరైన హెచ్‌ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు

- ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

కొడవలూరు : పాఠశాలల పరిశుభ్రతతో పాటు మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా ఎస్ఎంసీ చైర్మన్ల పర్యవేక్షణ ఉండాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, పారిశుద్ధ్యంపై హెచ్‌ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్‌లు, వెల్ఫేర్ సహాయకులకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకున్న చైర్మన్‌లు బాధ్యతగా వ్యవహరిస్తూ పిల్లలకు నాణ్యమైన భోజనం, పాఠశాలల్లో పారిశుద్ధ్యం మెరుగునకు కృషి చేయాలని కోరారు. ఎంఈఓ జి.వసంతకుమారి మాట్లాడుతూ ఎస్ఎంసీ చైర్మన్‌లు మంగళ, గురువారాల్లో పాఠశాలల్లో పారిశుద్ధ్యం పరిశీలించడంతో పాటు ఫొటోలను వారికి కేటాయించిన యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. వెల్ఫేర్ సహాయకులు సోమ, బుధవారాల్లో పాఠశాలల్లో పారిశుద్ధ్య పరిస్థితిని పరిశీలించి ఫొటోలను అప్‌లోడ్ చేయడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాల్సి ఉంటుందన్నారు. ఎంఈఓ ఎస్.అంకయ్య మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై హెచ్‌ఎంల నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. సమావేశంలో హైస్కూల్ హెచ్‌ఎంలు డి.ఓబులేసు, ఎ.మోహనరామలింగయ్య, సీఆర్‌ఎంటీలు ఎం.దయాకర్, లీలయ్య, టీవీ.సురేష్, శ్రీహరిబాబు, పి.రమేష్ పాల్గొన్నారు.

అదానీ స్కూల్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు

ముత్తుకూరు : కృష్ణపట్నంలోని అదానీ వరల్డ్ స్కూల్‌కు 2024 విద్యా సంవత్సరానికి ఢిల్లీలోని 'నేషనల్ స్కూల్ అవార్డు' ద్వారా అరుదైన ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. సృజనాత్మక విద్యతో పాటు విశాలమైన తరగతి గదులు, ఆధునిక ల్యాబ్ సౌకర్యం, సాంకేతిక విద్య, వ్యక్తిగత శ్రద్ధ, ఆహ్లాద వాతావరణం, శారీరక–మానసిక ఎదుగుదలకు అవసరమైన క్రీడలు ఉండడం వల్ల ఈ అవార్డు లభించిందని ప్రిన్సిపల్ సత్యనారాయణ చెప్పారు.

ఆర్థిక సాయం అందజేత

మనుబోలు : మండలంలోని జట్లకొండూరు గ్రామంలో పురేటి శేషయ్య మరణించడంతో అతని అంత్యక్రియల కోసం రూ.18 వేల ఆర్థిక సాయం అందించినట్లు ఉప సర్పంచ్ తులసీరాం బుధవారం చెప్పారు. తమ నాయకుడు కాకాణి ఆదేశాలతో గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలబడుతామని తెలిపారు. ఆయన వెంట జగదీష్, సురేష్, శ్రీనివాసులు, రవి ఉన్నారు.

అవినీతికి కేరాఫ్ సోమిరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పొదలకూరు : అవినీతికి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కేరాఫ్ అడ్రస్ అని, నీతి నిజాయతీ గురించి ఆయన మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చిన బ్రహ్మయ్య, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి బుధవారం మాట్లాడారు. మా నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవినీతిని ప్రోత్సహించే ప్రశ్నే లేదన్నారు. పొదలకూరులో అక్రమ లేఅవుట్లకు సోమిరెడ్డి బినామీగా మారారని తెలిపారు. ఎకరాకు ఎంత వసూలు చేసింది జనాలే లెక్కలు గట్టి చెబుతున్నారన్నారు. సోమిరెడ్డి ఓడిపోతే నాలుగేళ్లు జనాలకు కనిపించరని, కాకాణికి అధికారం ఉన్నా లేకున్నా జనాల మధ్యనే ఉంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్నారే తప్ప అభివృద్ధిపై దృష్టి సారించడం లేదన్నారు. మరుపూరు గోపాల్‌రెడ్డి ఇంట్లో సోదాలు చేసి ఏమి సాధించారో చెప్పాలని నిలదీశారు. సమావేశంలో నాయకులు మద్దిరెడ్డి రమణారెడ్డి, ఎస్కే అంజాద్, ఎస్కే ఖాదర్, వాకాటి శివారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, జి.వేణుగోపాల్‌రెడ్డి, ప్రసాద్, వెంకరమణారెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్

మనుబోలు : మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణుల్లో వచ్చే రక్తహీనతను నివారించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని బద్దెవోలు గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రతపై గర్భిణులు, బాలింతలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడ్లు, పాలు, ఆకుకూరలు, తాజా కూరగాయలు, పండ్లను రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాధా, వెంకటరమణమ్మ, సుబ్బమ్మ, దొరసానమ్మ, సంపూర్ణమ్మ, ముత్యాలమ్మ, కల్పన తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు : అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రమణమ్మ

మహ్మదాపురంలో..

పొదలకూరు : మండలంలోని మహ్మదాపురం గ్రామం ప్రగతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ మాట్లాడుతూ గర్భిణులు, కిశోర బాలికలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాల్సిందిగా సూచించారు. రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. ఏఎన్‌ఎం అరుణ, ఆశావర్కర్ పెంచలమ్మ, అంగన్‌వాడీ టీచర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. చెన్నారెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూపర్‌వైజర్ డి.పద్మజా వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పి.స్వర్ణలత, పద్మా, వెంకటమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

పూడిపర్తిలో ర్యాలీ

వెంకటాచలం : పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని పూడిపర్తి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పదార్థాలపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పౌష్టికాహార పదార్థాలపై గర్భిణులు, బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దివాకర్, ఏఎన్‌ఎం సులోచన, అంగన్‌వాడీ టీచర్ కామాక్షి, సచివాలయ మహిళా పోలీస్ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం

తోటపల్లిగూడూరు : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు ఐసీడీఎస్ పేదూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా చింతోపు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై తల్లులకు బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాల్సిన బాధ్యత అందరి తల్లిదండ్రులపై ఉందన్నారు. తగిన పౌష్టికాహారం అందినప్పుడే చిన్నారులు ఆరోగ్యకరంగా, పుష్టిగా ఎదుగుతారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహారాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులు పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లోకా పావని, పాపమ్మ, జ్యోతి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి

కొడవలూరు : గర్భిణులు, బాలింతలు, పిల్లలు అన్ని పోషకాలు లభ్యమయ్యే సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని కొడవలూరు సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల సూచించారు. మండలంలోని రామన్నపాళెం కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార విలువలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని పోషకాలు సమపాళ్లలో అందినప్పుడే పిల్లలు ఆరోగ్యకరంగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త జానకి తదితరులు పాల్గొన్నారు.

నార్తురాజుపాళెంలో..

స్థానిక సీబీఎన్ కాలనీలో 'పోషణ్ మహ' కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలామృతం కిట్‌లను పంపిణీ చేసి అందులో ఉన్న పోషకాలు వాటి ప్రయోజనాలను వివరించారు. చిన్నారులకు విధిగా బాలామృతం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు యు.మంజుల, ఎస్.సుదర్శన, సహాయకురాలు సీహెచ్.పోలేరమ్మ పాల్గొన్నారు.

కొత్తవంగల్లులో..

మండలంలోని కొత్తవంగల్లులో పౌష్టికాహార మహోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి పోషకాహార విలువలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ జాస్మిన్, ఏఎన్‌ఎం శాంతకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.సుజాత, టి.సుప్రజ, కె.కుమారి, ఎం.భారతి, ఎస్.కామేశ్వరి పాల్గొన్నారు.



పొదలకూరు : పిల్లలకు పౌష్టికాహారం అందజేత



పొదలకూరు : చెన్నారెడ్డిపల్లిలో..



వెంకటాచలం: పూడిపర్తిలో అవగాహన ర్యాలీ



కొడవలూరు : రామన్నపాళెంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నిర్మల



కొడవలూరు : నార్తురాజుపాళెం సీబీఎన్ కాలనీలో బాలామృత కిట్‌ల అందజేత



కొడవలూరు : కొత్తవంగల్లులో..



తోటపల్లిగూడూరు : చింతోపు అంగన్‌వాడీ కేంద్రంలో..